## కేసీఆర్ త్వరగా కోలుకోవాలని..

- మేడారంలో సమ్మక్క సారలమ్మకు బీఆర్ఎస్ నేతల మొక్కులు



మేడారం శ్రీసమ్మక్క సారలమ్మను దర్శించుకున్న కౌన్సిలర్, నాయకులు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 14 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని మేడారం శ్రీసమ్మక్క,సారలమ్మను దర్శించుకుని వేడుకున్నట్లు హుజూరాబాద్ బీఆర్ఎస్ నాయకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ అపరాజ ముత్యంరాజు, బీఆర్ఎస్ నాయకులు భూమ్ రామకృష్ణ, 19వ వార్డు అధ్యక్షుడు కందుల స్వామిపటేల్, పోచమ్మ దేవస్థానం గౌరవాధ్యక్షుడు రమేశ్, నాయకులు రోహిత్, ప్రసాద్ ఉన్నారు.

## 'గాయత్రీ' బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందిస్తున్న తహసీల్దార్ రజిని

జమ్మికుంట,డిసెంబర్ 14 : పట్టణంలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు మద్దూరి రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా, గాయత్రి బ్యాంకు జమ్మికుంట బ్రాంచ్ మేనేజర్ మహేందర్ ఆధ్వర్యంలో రూ.లక్ష బీమా చెక్కును బాధిత కుటుంబానికి మండల తహసీల్దార్ రజినీ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి బీమా ధీమా ఇస్తుందని తెలిపారు. బ్యాంకు సేవలను మేనేజర్ మహేందర్ వివరించారు. ఇక్కడ బాధిత కుటుంబసభ్యుడు మద్దూరి కృష్ణమూర్తి,సిబ్బంది ఉన్నారు.

## సెపక్ తక్రాలో చెంజర్ల విద్యార్థి ప్రతిభ



ఎంపికైన విద్యార్థి అకిరానందన్‌తో ఉపాధ్యాయులు

మానకొండూర్ రూరల్, డిసెంబర్14 : తెలంగాణ రాష్ట్రంలో గత నెల నవంబర్18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సెపక్ తక్రా క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి అకిరానందన్ సెపక్ తక్రాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు జిల్లా సెపక్ ప్రధాన కార్యదర్శి గన్న విజయ భాస్కర్ తెలిపారు. డిసెంబర్ 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో అకిరానందన్ పాల్గొననున్నట్లు విజయ భాస్కర్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖురేషి, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, సమ్మి రెడ్డి, పద్మజ, శ్రీలత, రవీందర్, వసు మతి, శ్రీలత, పీఈటీ కుమార్, విద్యార్థులు అభినందించారు.

## 'భట్టి'ని కలిసిన 'తుమ్మేటి'



భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు చెబుతున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట, డిసెంబర్ 14 : ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను సచివాలయంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందించారు. శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. డిప్యూటీ సీఎంగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై అభినందనలు తెలిపారు.

# తొలిమెట్టును విజయవంతం చేయాలి

- బోధనాభ్యసనలో అడ్డంకులను అధిగమించాలి
- రాష్ట్ర పరిశీలకుడు, ఓపెన్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి



శంకరపట్నం: మొలంగూర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో సూచనలు చేస్తున్న ఓపెన్ స్కూల్స్ జేడీ, రాష్ట్ర పరిశీలకులు సోమిరెడ్డి , తదితరులు

శంకరపట్నం, డిసెంబర్ 14: తొలిమెట్టును విజయవంతం చేయాలని స్టేట్ అబ్జర్వర్, ఓపెన్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి పేర్కొన్నారు. మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌పై స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా సమావేశం జరిగింది. రెండోరోజు శిక్షణలో భాగంగా 50 శాతం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు హాజరయ్యారు. సోమిరెడ్డి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రాథమిక స్థాయి బోధనలో విద్యార్థుల జాయ్‌ఫుల్ లెర్నింగ్‌కు కృషి చేయాలన్నారు. బోధనాభ్యాస ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, మండల నోడల్ అధికారి, తాడికల్ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్, రిసోర్స్ పర్సన్లు టీ భూపతి, బీ కిరణ్, సీఆర్పీ తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించడంతో వారు అన్ని సబ్జెక్టుల్లో విద్యా ప్రమాణాలను సులభంగా సాధిస్తారని అన్నారు. తొలిమెట్టు ప్రగతిని ఎఫ్ఎల్ఎన్ఎ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్ రెడ్డి, నోడల్ ఆఫీసర్స్ వీ సుధాకర్ రెడ్డి, సమ్మిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు అనిల్, ఆంజనేయులు, ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైదాపూర్, డిసెంబర్14 : ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని రాష్ట్ర పరిశీలకులు, ఓపెన్‌స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి సూచించారు. మండలకేంద్రంలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సమయసారిణిలో లైబ్రరీ పీరియడ్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, నోడల్ అధికారి కట్టా రవీంద్రచారి,హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

- డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆపేది లేదు
- అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 14 : అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రామీణ డాక్ సేవకులు తమ డిమాండ్ల కోసం దేశ వ్యాప్తంగా నేటి నుంచి పూర్తి స్థాయిలో నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఈ శిబిరాన్ని ఎన్ఎఫ్‌పీఈ భాగస్వామ్య సంఘాలైన గ్రూప్ సీ, గ్రూప్ డి సంఘాల నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. సమ్మెలో పాల్గొన్న అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ మాట్లాడుతూ, డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌తోపాటు నాయకులు ఈ సమ్మయ్య, పీ3 నాయకులు పీ రవికుమార్, జే రజినీకాంత్, అమర్, ప్రభాకర్, పీ4 నాయకులు ఎం సంపత్, సత్యం, జీడీఎస్ నాయకులు ఈ రాజు, బీ సతీశ్, స్వామి, రాజేశ్ పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల సమన్వయం అవసరం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 14 : ప్రతి గ్రామానికి వచ్చే బీఎల్వోలకు రాజకీయ ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు మానకొండూర్ నియోజక వర్గ పరిధిలోని వివిధ రాజకీయ ప్రతినిధులతో, మండల తహసీల్దార్లతో మానకొండూర్ తహసీల్దార్ కార్యాయలంలో గురువారం తహసీల్దార్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ హాజరై మాట్లాడుతూ 13 వందల కన్నా ఎక్కువ మంది ఓటర్లుంటే ఒక పోలింగ్ కేంద్రంగా తీసుకోవాలని, ఇంకా కావాల్సి వస్తే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రంలోని మరణించిన వారు ఉంటే పూర్తి వివరాలను తీసుకొని తొలగించాలన్నారు. బదిలీ అయిన వారి వివరాలను కూడా ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో పోలింగ్ స్టేషన్‌కు పూర్తి వివరాల కాపీలను తీసుకొని మార్చాలన్నారు. ప్రతి గ్రామంలో అన్ని పార్టీల ప్రతినిధుల సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఎన్నికల సి బ్బంది, వివిధ రాజకీయ ప్రతినిధులు ఉన్నారు.

### ఎలుగు బంటి కలకలం

గన్నేరువరం, డిసెంబర్ 14 : మండలంలోని పారువెల్ల ఊర చెరువు మత్తడి వద్ద బుధవారం రాత్రి ఎలుగు బంటి సంచారం కలకలం రేపింది. రాత్రివేళ ఒక వాహనదారుడు ఎలుగుబంటిని చూసి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నేటి నుంచి బస్సుల్లో ఆధార్ కార్డు తప్పనిసరి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 14 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈ నెల 9 నుంచి తెలంగాణ మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నది విధితమే. అయితే 15వ తేదీ నుంచి మహిళా ప్రయాణికులు తప్పనిసరిగా ఆధార్ కార్డును చూపించి కండక్టర్ వద్ద నుంచి జీరో టికెట్ తీసుకోవాలని హుజూరాబాద్ డిపో మేనేజర్ అర్పిత గురువారం తెలిపారు. మహిళా ప్రయాణికులు తప్పనిసరిగా ఆధార్ చూపించాలని, లేకపోతే తీసుకెళ్లడం కుదరదన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్14 : రంగాపూర్ కల్వరి టెంపుల్‌లో రెవరెండ్ డాక్టర్ పీఆర్ నెల్సన్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు గురువారం నిర్వహించారు. రెవ.కె సీమోనుబాబు-ఎస్తేర్ రాణి దంపతులు హాజరై సందేశం ఇచ్చారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన అగ్రప్ప పద్మ దంపతులు 30 మంది పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పాస్టర్స్ శాంసన్‌రత్న, సువార్త రాజులావణ్య, ఆనందంఎలిషమ్మ, సీహెచ్ రాజు, ఎన్ ప్రవీణ్ పాస్టర్స్ హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

## 'పీఏసీఎస్'ను సందర్శించిన అగ్రి విద్యార్థులు

జమ్మికుంట, డిసెంబర్14 : జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్‌లో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని పీఏసీఎస్ గోదాంలను సందర్శించారు. పీఏసీఎస్ విధి విధానాలు, గోదాంలో నిల్వలు, రైతుల ఆర్థికాభివృద్ధికి సంఘం తీరుతెన్నులు, తదితర అంశాలను చైర్మన్ సంపత్‌ను అడిగి తెలుసుకున్నారు. మోత్కులగూడెంలో రైతులను కలిశారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కార్యదర్శి రవి, కౌన్సిలర్లు రాము, రమేశ్, శ్రీలత, ఎఫ్‌పీవో మహేందర్, శాస్త్రవేత్తలు మహేశ్, ప్రశాంతి, వేణుగోపాల్, రైతులు, విద్యార్థులున్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మానకొండూర్, డిసెంబర్ 14 : దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ (వీజేఏసీ) మానకొండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వీజేఏసీ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీజేఏసీ మండలాధ్యక్షుడు శాతరాజు తిరుపతి, జిల్లా కోకన్వీనర్ కండె సంపత్, మండలాధ్యక్షురాలు గడ్డం స్వరూప, నాయకులు కండె మమత, పిట్టల కవిత, ముద్దసాని విజయ, పూరెల్ల శిరీష, సీసీ వాణి, వజ్రమ్మ, శైలజ, రాజవ్వ, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య

శంకరపట్నం, డిసెంబర్ 14: మండలంలోని ఎరడపల్లిలో జంగిలి కొమురయ్య (62) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్య భార్య, కూతురికి దూరంగా ఎరడపల్లిలో ఒంటరి జీవనం సాగిస్తున్నాడు. అతడికి కొంతకాలంగా కంటి చూపు మందగించింది. అయితే అప్పుడప్పుడు కూతురు లావణ్య తండ్రి వద్దకు వెళ్లి బాగోగులు విచారించి వచ్చేది. ఒంటరి జీవనం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఇరుగుపొరుగువారు చూసి భార్య, కూతురుకు తెలుపడంతో వారు ఎరడపల్లికి వచ్చారు. ఏఎస్ఐ సుధాకర్ వివరాలు నమోదు చేసుకున్నారు. కొమురయ్య కూతురు లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.